క్లుప్తంగా

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



రాయనపాడు (విజయవాడ రూరల్): రాయనపాడు, గొల్లపూడి, ఈలప్రోలు గ్రామాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాలని కోరుతూ గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నర్రా వాసు, మాజీ ఉప ఎంపీపీ కాటంనేని పూర్ణచంద్రరావులు రైల్వే జనరల్ మేనేజర్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. రాయనపాడు రైల్వే స్టేషన్‌ను శ్రీవాత్సవ బుధవారం సందర్శించారు. శ్రీవాత్సవను వారు కలిసి స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పంపిన లెటర్‌ను వారు అందజేశారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులకు అవసరమైన భూ సేకరణ త్వరగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేణుగోపాలుని శాంతి కల్యాణం



తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. వేణుగోపాల మహామంత్ర సహా పౌండరీక మహాశాంతి హోమం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య, ఆలయ కమిటీ చైర్మన్ శశిరేఖ, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో బుధవారం డివిజన్ స్థాయి ఇన్‌స్పైర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇన్‌స్పైర్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కోర్సు డైరెక్టర్‌గా ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్ఎం పుష్పలత వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఈఓ-1, 2 దేవర ప్రసాద్, ఎస్.జమలయ్య మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన సూచనలు, సలహాలను పాటించి విద్యార్థులు ప్రయోగాలు చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రీసోర్స్ పర్సన్లు వెంకటేశ్వరరావు, కె.జాన్, గంగాధర్ ఇన్‌స్పైర్ ప్రాజెక్టు చేసే విధానం, ఈ ఏడాది థీమ్, ఏఏ అంశాల్లో ప్రాజెక్టు చేయాలి, ప్రాజెక్టు ఉండాల్సిన లక్షణాలు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజుల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

లక్ష్మీనారాయణకు నివాళి



తిరువూరు: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు మాచిబోయిన లక్ష్మీనారాయణ (90) బుధవారం మృతి చెందారు. తిరువూరు డివిజన్‌లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన కార్యకర్తగా ఉద్యమాల్లో పాల్గొనడమే కాక సీపీఎం నిర్మించిన సుందరయ్య భవన్‌కు స్వయంగా విరాళాలు అందజేసిన లక్ష్మీనారాయణ ఎటువంటి పదవులు ఆశించకుండా సామాన్య కార్యకర్తగానే కొనసాగారు. ఆయన మృతికి సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు.

ఆ గ్రామాలకు ఉచిత బస్సులు డౌటే

- నూజివీడు నియోజకవర్గంలో అధిక గ్రామాలకు నడవని బస్సులు
- పల్లె వెలుగు సర్వీసులు లేకుండా ఉచిత బస్సులు సాధ్యమేనా ?
- ఇప్పటికీ గ్రామస్తులకు ఆటో ప్రయాణమే దిక్కు



నూజివీడు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులు

నూజివీడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పల్లె వెలుగు బస్సు సర్వీసులు లేని గ్రామాలు నియోజకవర్గంలో 80 శాతానికి పైగా ఉండటంతో ఉచిత బస్సు పథకం చాలా గ్రామాల మహిళలకు అందని ద్రాక్షగా మారనుంది. బస్సులు వెళ్లని గ్రామాలు అధిక శాతం ఉండగా మిగిలిన గ్రామాలకు బస్సులు అరకొరగానే వెళుతున్నాయి. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణాన్ని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గంలోని చాట్రాయి, ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లోని ప్రధాన రహదారులపై ఉన్న గ్రామాల ప్రజలకు పల్లె వెలుగు బస్సులు అందుబాటులో ఉన్నాయే తప్ప మారుమూల గ్రామాల ప్రజలకు బస్సు సర్వీసులు అందుబాటులో లేవు. ఆగిరిపల్లి మండలంలో ఆగిరిపల్లి-విజయవాడ రూట్‌లో, నూజివీడు మండలంలోని నూజివీడు-హనుమాన్ జంక్షన్, మైలవరం, విస్సన్నపేట రూట్లలోనూ, చాట్రాయి మండలంలో విస్సన్నపేట-చింతలపూడి రూట్‌లో, ముసునూరు మండలంలో నూజివీడు-ఏలూరు రూట్‌లో మాత్రమే బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. విస్సన్నపేట-చింతలపూడి, నూజివీడు-ఏలూరు రూట్‌లో అయితే అరకొరగానే బస్సు సర్వీసులు ఉన్నాయి.

పల్లె వెలుగు సర్వీసు లేని గ్రామాలు ఎన్నో..

నూజివీడు మండలంలో సిద్దార్థ నగర్, నర్సపేట, లైన్‌తండా, హటియాతండా, కుక్కల తండా, కొత్తూరు తండా, వెంకటాయపాలెం, పడమర దిగవల్లి, తూర్పు దిగవల్లి, ముక్కొల్లుపాడు, జంగంగూడెం, దేవరగుంట, పోతురెడ్డిపల్లి, ఎంఎన్‌పాలెం, పల్లెర్లమూడి, పోలసానపల్లి, రామన్నగూడెం, బోర్వంచ, పాత రావిచర్ల, కొత్త రావిచర్లలకు బస్సు సదుపాయం లేదు. ముసునూరు మండలంలో రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, బాస్వరప్పాడు, సూరేపల్లి, లోపూడి, చెక్కపల్లి, గోగులంపాడు, గుడిపాడు, గుళ్లపూడి, యల్లాపురం, వలసపల్లి, బలివే, వెంకటాపురం, కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లిలకు బస్సు సదుపాయం లేదు. కొర్లగుంట, ముసునూరు, చింతలవల్లి, గోపవరం, వేల్పుచర్లకు అరకొరగా బస్సు సదుపాయం ఉంది. చాట్రాయి మండలంలో చనుబండ, సూరంపాలెం, కృష్ణారావుపాలెం, నరసింహారావుపాలెం, సీ-గుడిపాడు, బూరుగగూడెం, చీపురుగూడెం, చిన్నంపేట, మంకొల్లు, పోలవరం, పోతనపల్లి, మర్లపాలెం, తుమ్మగూడెం, చిత్తపూరు, జనార్ధనవరం, ఆరుగొలనుపేట, సోమవరం, కొత్తగూడెం గ్రామాలకు బస్సు సదుపాయం లేదు. చాట్రాయి, పోలవరం, చీపూరుగూడెంలకు అరకొరగా బస్సు సర్వీసులున్నాయి. ఆగిరిపల్లి మండలంలో వట్టిగుడిపాడు, ఈదులగూడెం, చొప్పరమెట్లకు అరకొర బస్సు సర్వీసులుండగా కొమ్మూరు, సగ్గూరు, కలటూరు, అమ్మవారిగూడెం, తోటపల్లి, నర్సింగపాలెం, ఈదర, శోభనాపురం, సీతారామపురం, ఎస్ఏపేటలకు బస్సు సర్వీసులు లేవు. ఈ గ్రామాల మహిళలు వారిఊరి నుంచి వేరే ఊరు వెళ్లాలంటే ఆటో ఎక్కాల్సిందే.

మండల కేంద్రాలకు రావాలన్నా ఆటోలే దిక్కు

మహిళలు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లాలన్నా, బ్యాంకులకు రావాలన్నా ఆటోలు ఎక్కి ప్రయాణించాల్సిందే. మండలంలోని గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఎక్కడా కూడా బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రజలకు ఆటోలే దిక్కయ్యాయి.

బస్సు సర్వీసులను పెంచాలి



బస్సు సర్వీసులు లేని గ్రామాలకు బస్సు సర్వీసులు పెంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు వెళ్లడం లేదు. ఈ పరిస్థితుల్లో గ్రామీణ మహిళలకు ఈ పథకం అందాలంటే బస్సు సర్వీసు లేని గ్రామాలకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలి.

–జి.రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, నూజివీడు

వరిలో కలుపు నివారణతో తెగుళ్లు దూరం

ముసునూరు: వరి పంటలో సకాలంలో కలుపు తీయడం ద్వారా తెగుళ్లు దూరమై అధిక దిగుబడులు లభిస్తాయని వ్యవసాయ శాఖాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. బుధవారం వేల్పుచర్ల, యల్లాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ మోహనరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, రైతులు ఘంటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

తిరువూరురూరల్: మండలంలోని పెద్దవరం, వావిలాల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటల సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యంపై వ్యవసాయాధికారి పద్మ అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి చేకూరని రైతులు రైతు సేవా కేంద్రాల్లో వివరాలు సమర్పించాలని సూచించారు. పెద్దవరం సర్పంచి గద్దె అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

మైలవరం: మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండతో ఇబ్బంది పడిన మైలవరం ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి సేద తీరారు. పలుచోట్ల రోడ్లు జలమయమవడంతో రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు.

తల్లిపాలు అమృతంతో సమానం

ఇబ్రహీంపట్నం: తల్లిపాలు అమృతంతో సమానమని, తల్లిపాలు తాగిన పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన శ్రీనివాస్ అన్నారు. మూడో వార్డు సచివాలయంలో బుధవారం జరిగిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో పాటు బాల్య వివాహాల నిర్మూలనకు ఐసీడీఎస్ సిబ్బంది కృషి చేయాలన్నారు. సీడీపీఓ పుష్పలత మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. వెల్ బేబీషో నిర్వహించి బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ మాధవి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో వెల్‌బేబీ షో లో బహుమతులు అందుకున్న తల్లులు

తల్లిపాల ఆవశ్యకతపై ప్రచారం..

తిరువూరు: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తిరువూరులోని రాజుపేట అప్పనాలపేట, వైష్ణవ బజారు, వడ్డెర బజారు, ఎంపీఆర్ వీధి, బెస్తబజారు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణులు, తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాలలో ఉండే రోగ నిరోధక శక్తి వలన పసిబిడ్డకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉండదని, పోతపాల కంటే తల్లిపాలు ఎంతో మేలని అంగన్‌వాడీ కార్యకర్తలు భవాని, శ్రీలక్ష్మి, శ్రీదేవి, రేణుక, పద్మజ తదితరులు ప్లకార్డులు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పిల్లలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహార ప్రాధాన్యాన్ని వివరించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



తిరువూరులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముసునూరు: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని గోపవరం పంచాయతీ కార్యాలయం వద్ద తల్లిపాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జీఎంఎస్‌కే సలోమి, రాగసుధ మాట్లాడారు. ఏఎన్ఎం శకుంతల, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

నూజివీడు: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డకు అవసరమైన పోషక పదార్థాలు తల్లిపాలల్లోనే ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి అన్నారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఏఎన్ఎం డి.శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్ షేక్ మెహతాబీ, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మంచినీరు లేదు.. విద్యుత్ దీపాలు వెలగవు

మున్సిపల్ కమిషనర్ దృష్టికి సమస్యలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కమిషనర్ రమ్యకీర్తనకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో తాగునీటి సరఫరా నిలిపోయిందని, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, కనీసం వీధి లైట్లు కూడా వెలగకపోవడంతో చీకట్లో పాములు సంచరిస్తున్నాయని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. 30వ నంబర్ జాతీయ రహదారిపై లైట్లు వెలగక వాహన దారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వార్డు కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, బి.నాగరాజకుమారి, షీనాబేగం, మోటూరి అరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మిక్కిలి శరభయ్య, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, వివిధ విభాగాలకు చెందిన నాయకులు జి.రాణి, కె.జయరాజు, కె.శ్రీనివాసరావు, ఎస్.ఈశ్వరి, రాజేష్, వి.సుబ్బారావు, బాలచందర్, చంటి, చందు, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తనకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి

నూజివీడు: పట్టణంలో తక్షణమే ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) నూజివీడు మున్సిపల్ శానిటేషన్ కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశం పట్టణంలోని అమర్‌భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని రంగాలకు చెందిన కార్మికులకు ఈఎస్ఐ డిస్పెన్సరీ సౌకర్యం లేక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. కనీసం ఔషధాలు కూడా అందుబాటులో లేవని, ప్రభుత్వం స్పందించి ఈఎస్ఐ డిస్పెన్సరీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హెల్త్ అలవెన్స్ కొనసాగించాలని, కనీస వేతనం రూ.32 వేలు చెల్లించాలన్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఐ.సత్యప్రకాష్, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, నూజివీడు మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాల విజయ్, కార్యదర్శి నంద తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎంపీడీఓ భార్గవి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గోళ్ల అనూష, ఎంపీడీఓ భార్గవి

ఆగిరిపల్లి: మండలంలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ బి.భార్గవి పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆగిరిపల్లి ఎంపీటీసీ సాదం గోపి మాట్లాడుతూ ఆగిరిపల్లి శోభనాచల స్వామి ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటివరకు ఎంతమేర నిధులు విడుదలయ్యాయని ప్రశ్నించారు. పంచాయతీరాజ్ ఏఈ వాసుదేవరావు మాట్లాడుతూ ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.75 లక్షల నిధులు విడుదలయ్యాయని, ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. నెక్కలం గొల్లగూడెంలో విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎంపీటీసీ సభ్యులు గుర్రం శ్రీనివాసరావు తెలపగా, ఏఈ రామారావు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. డెప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్ మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డుల కోసం మండలంలో 2,349 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 1,570 మందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయని, ఇంకా ఎవరైనా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే సమయం ఉందని చెప్పారు. పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కాకవడంతో ఎంపీపీ గోళ్ల అనూష ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైస్ ఎంపీపీ కొండ వరదలు రమేష్, ఏఓ అబ్దుల్ సలాం, సర్పంచులు అత్తి మురళి, వేమురాజు, జాల భూషణం, సాగర్, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ రియాజ్, ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

ఏసీపీ వై. ప్రసాదరావు

మైలవరం: విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏసీపీ వై. ప్రసాదరావు పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్, మత్తు పదార్థాలు అంశంపై అవగాహన సదస్సు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమన్నారు. ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తోటి విద్యార్థులలో సోదరభావంతో మెలగాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐలు ఏవీ కృష్ణారెడ్డి, టి. దుర్గాభవాని మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నాదెళ్ల

మైలవరం: రెడ్డిగూడెం మండలం శ్రీరామపురం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నాదెళ్ల చెన్నకేశవరావు (కేసీబాబు) నియమితులయ్యారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను బుధవారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ చెన్నకేశవరావును శాలువాలతో సత్కరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శుభశేఖర్

ఆగిరిపల్లి: ప్రైవేట్ స్కూల్, కళాశాల బస్సు డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ అన్నారు. బుధవారం గోపాలపురం ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో రహదారిపై ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రూరల్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు వాహన కండిషన్ పరిశీలించడంతో పాటు బస్సులు నడిపేటప్పుడు సేఫ్టీ రూల్స్‌ను పాటిస్తూ విద్యార్థులను గమ్య స్థానానికి చేర్చాలని సూచించారు. మద్యం తాగి బస్సులు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ శుభశేఖర్, పోలీస్ సిబ్బంది, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

నందిగామ టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ రమేష్ తివారి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల గ్లోబల్‌వార్మింగ్ వంటి ఉపద్రవాలను నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డీజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్ కుమార్, డీన్ జాన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న 'క్విట్ కార్పొరేట్'

నూజివీడు: వ్యవసాయ రంగాన్ని కబళించాలని చూస్తున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ఆగస్టు 13న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అఖిల భారత కిసాన్ మహాసభ జాతీయ కార్యదర్శి డి.హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజున దేశవ్యాప్తంగా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందన్నారు. ఇండో అమెరికా ఒప్పందం, ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ రద్దు చేయాలన్నారు, బలవంతపు భూసేకరణను నిలిపివేసి 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని వినతి



జి.కొండూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేసి పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు స్థానిక విద్యుత్ శాఖ ఏఈ మహ్మద్ షఫీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ పగడాల వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన మంత్రి నారా లోకేష్, నేడు అధికారం చేతికొచ్చాక అవే స్మార్ట్ మీటర్లను అమర్చుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సంతకాల సేకరణ..

తిరువూరు: వినియోగదారులపై పెనుభారం మోపే స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఎ.కొండూరు మండలం కంభంపాడులో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లతో కలిగే ఇబ్బందులను వినియోగదారులకు తెలియజేస్తూ పార్టీ మండల కార్యదర్శి ఆనందరావు, స్థానిక నాయకులు అమ్మిరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, జమలయ్య తదితరులు సంతకాలు సేకరించారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

పెనుగంచిప్రోలు: కొద్దిపాటి జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చని జగ్గయ్యపేట ఫైర్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధ వారం స్థానిక తిరుపతమ్మవారి ఆలయం వద్ద గ్యాస్ ప్రమాదాలపై దుకాణదారులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ పైపులు కంపెనీవి మాత్రమే వాడాల, సిలిండర్ తీసుకునే ముందు సిలిండర్ ముగింపు తేదీతో పాటు ఓపెన్ చేసిన వెంటనే లీక్ అవుతుందా లేదా చూసుకోవాలన్నారు. సిలిండర్ మంటలు వ్యాపించిన వెంటనే పేలదని, సిలిండర్‌లోని లిక్విడ్ మొత్తం ఆవిరై వేడి ఎక్కిన తరువాత మాత్రమే పేలుతుందన్నారు. మంటలు వ్యాపించిన వెంటనే సిలిండర్ బయటకు తీసుకు వచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్ధారెడ్డి, ఆర్ఐ హలీమ్ పాల్గొన్నారు.